

సెక్యూరిటీ ఎస్ఒ రాజన్నపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప రిమ్స్ జిజిహెచ్ ఈగల్ వర్ల్డ్ సెక్యూరిటీ ఏజెన్సీ పరిధిలో పనిచేస్తున్న కార్మికులను కొందరిని ఇబ్బందులకు గురి చేస్తున్న ఎస్ఒ రాజన్నపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రిమ్స్ జిజిహెచ్‌లో సెక్యూరిటీ, ఇతర కార్మికులు ఏజెన్సీ పరిధిలో పనిచేస్తున్నారని తెలిపారు. కార్మికులకు సరైన సమయంలో వేతనాలు రాకపోవడం, కార్మికులను మానసికంగా కొంతమందిని ఇబ్బందులు గురి చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకత్వం అధికారి వద్దకు తీసుకెళ్తే వారిని బెదిరించడం ఎస్ఒకు తగదని తెలిపారు. కార్మికుల సమస్యల మీద పనిచేసే సంఘ నాయకులను బెదిరించడం, ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. కార్మికులతో పని చేయించుకోవాల్సిన బాధ్యత ఎస్ఒపై ఉండగా, కొందరిపై కక్షపూరితంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. వీటిపై విచారించి కఠినమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

గనుల్లోకి వర్షపు నీరు



- మూతపడిన నాపరాయి పరిశ్రమలు
- మునిగిన మిషన్లు, బండ రాళ్లు
- రెండు నెలలుగా ఆగిన పనులు
- ఆర్థిక ఇబ్బందుల్లో యజమానులు
- పూట గడవని స్థితిలో కార్మికులు

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల

మండల వ్యాప్తంగా ఉన్న నాపరాయి గనుల్లో, పరిశ్రమల్లో వేలామంది కార్మికులు పనులు చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల నాపరాయి గనులలో వర్షపు నీరు నిండిపోయింది. గనులలో పనులు చేసుకుని జీవించే కార్మికులు సుమారు 2 వేల మంది ఉన్నారు. వారంతా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గనుల వద్ద నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా పరిశ్రమలకు రాళ్లను తరలించే యజమానులకు, కార్మికులకు పనులు లేకపోవడమే కాకుండా అవస్థలు పడుతున్నారు. ఉపాధి కోసం ట్రాక్టర్లు ఫైనాన్స్ తెచ్చుకున్న వారు చాలామంది ఉన్నారు. వారంతా ఫైనాన్స్ కంతులు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నారు. నాపరాయి పరిశ్రమలు సుమారు 250 ఉన్నాయి. ఒక్కో మిషన్లో 20 మంది చొప్పున సుమారు 5 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. గనులు మునగటంతో రాళ్లు లేక చాలా మిషన్లలో పనులు ఆగిపోయాయి. ఈ క్రమంలో యజమానులు, కార్మికులు ఇరువురు పనులు లేక, కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలు లీజుకు తీసుకొని నడిపే వారి పరిస్థితి చెప్పనలవి కావడం లేదు. కరెంట్ బిల్లులు, రాయల్టీలు, కూలి ఖర్చులు పెరిగాయి. తక్కువ వ్యాపారాలు చేసుకునే క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలు వారిని మరింత ఇబ్బందులకు గురిచేశాయి. చైన్ లింకు లాగా గనుల యజమానులు, కార్మికులు రాయి బయటకు తీస్తారు. వాటిని లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తే కార్మికులు, యజమానులు ఉపాధి పొందుతున్నారు. అలాగే ఆ నాపరాయిని పాలిష్ చేసే పాలిష్ మిషన్ల యజమానులు, కార్మికులు ఉపాధి పొందుతున్నారు. వాటిని ఇతర రాష్ట్రాలకు పంపించి లారీల యజమానులు, లోడింగ్ కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇలా సుమారు పదివేల మంది పైనే కార్మికులు, యజమానులు ఉపాధి పొందుతూ జీవిస్తున్నారు. వారందరూ ప్రస్తుతం కుటుంబ పోషణ కూడా డబ్బులు లేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫైనాన్స్‌లో తీసుకున్న వాహనాలకు కంతులు చెల్లించలేక అధిక వడ్డీలతో సతమతమవుతున్నారు.



మిషన్లలో నిల్వఉన్న వర్షపునీరు

రెండు నెలలుగా పనులు లేవు



సుమారు రెండు నెలలుగా వర్షాల కారణంగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కుటుంబ పోషణ భారం అవుతుంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఖర్చులు అప్పులు చేసి వడ్డీలు కట్టలేకున్నాం. గనుల యజమానులు స్పందించి నీటిని బయటకు కొట్టించి పనులు చేయిస్తే మాకు మేలుగా ఉంటుంది.

- దేవదానం, నాపరాయి గనిలో కార్మికుడు.

గనిని నమ్ముకుని జీవిస్తున్నాం



గని పనులనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. చాలా రోజులుగా పనులు జరగడం లేదు. ఈ సంవత్సరం అధిక వర్షాలు పడడంతో గనులు నీట మునిగిపోయాయి. పనులు లేక అప్పుల పాలవుతున్నాం. ఇతర పనులు కూడా ఎక్కడ దొరకడం లేదు. కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నాం.

- పుష్పరాజు, నాపరాయి గనిలో కార్మికుడు.



గనుల్లోకి చేరిన వర్షపునీరు

అప్పులపాలవుతున్నాం



ట్రాక్టర్లు పెట్టుకొని గనులలో నుంచి రాళ్లు బయటకు తరలించే పనులు చేస్తూ ఉంటాం. ఈ సంవత్సరం పనులు పూర్తిగా తగ్గిపోయాయి. బయట నిర్మాణాలు తగ్గిపోయి, నాపరాయికి డిమాండ్ తగ్గింది. బాడుగలు లేక ట్రాక్టర్లకు తీసుకున్న ఫైనాన్స్ కంతులు చెల్లించలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నాం. డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నాం. లోడింగ్ కార్మికులకు ఉపాధి చూపించలేక పోతున్నాం.

- కానాల చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాక్టర్ యజమాని.

పరిశ్రమలు పూర్తిగా నిలిచిపోయాయి



ఇటీవల కురిసిన వర్షాల వల్ల నాపరాయి పరిశ్రమల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు నెలల నుంచి కార్మికులకు ఉపాధి చూపలేక పోతున్నాం. కరెంట్ బిల్లులు, మెయింటెనెన్స్ ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నాం. ముందుగానే ఆకారణం నున్న వ్యాపారాలు ప్రస్తుతం పూర్తిగా నిలిచిపోయాయి. [illegible] చాలా తగ్గిపోయింది. నిర్మాణాలు చేస్తున్నవారు టైల్స్, గ్రానైట్ వైపు మొగ్గు చూపుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే పరిశ్రమలను మూసివేయాల్సి వస్తుంది. యజమానులకు, కార్మికులకు ఉపాధి పోయే ప్రమాదం ఉంది.

- వేణుగోపాల్ నాపరాయి పరిశ్రమ యజమాని.

కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



నాపరాయికి సంబంధించి గనులలో, పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు ప్రస్తుతం గత రెండు నెలలుగా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల వల్ల గనులు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. నాపరాయి పరిశ్రమలలోకి నీరు చేరి పనులు నిలిచిపోయాయి. కుటుంబ ఖర్చులు అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొని అప్పుల పాలవుతున్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి. ఎర్రగుంట్లలో, చిలమకూరులో మొత్తం 250 పరిశ్రమలలో, గనులలో, లోడింగ్ కార్మికులు ఇలా సుమారు పదివేల మంది ఉపాధి పొందుతుండేవారు. వారందరికీ పనులు లేక ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- వి.అన్వేష్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు.

తొమ్మిది మంది గంజాయి విక్రేతలు అరెస్టు

గంజాయి, మాత్రలు స్వాధీనం
ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి గంజాయి, మాత్రలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని డిటిసి సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న సురభి మహేష్, మరో ఎనిమిది మందిని రిమ్స్ పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 1.15 లక్షల విలువ గల 23.580 కిలోల గంజాయిని, రూ.96 వేలు విలువచేసే మాత్రలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సురభి మహేష్‌పై మన జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో, రాష్ట్రాలలో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీట్ కూడా ఉందని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఇంద్రజిత్ తో పరిచయం ఉందని చెప్పారు. గతంలో జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టయిన కిరణ్ కుమార్, రహమతుల్లా, అబ్దుల్ రజాక్, మణికంఠ, అల్తాఫ్, నాగేంద్ర, మన్సూర్ ఖాన్, శివ ప్రశాంత్‌తో ఒక గ్యాంగ్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. వీరు గంజాయి వ్యాపారంతో పాటు కర్నూలుకు చెందిన మెడికల్ షాప్ యజమాని నాగేంద్రతో చేతులు కలిపి మాత్రలు అమ్మడం మొదలు పెట్టారని తెలిపారు. వచ్చిన లాభాలతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని చెప్పారు. డిఎస్‌పి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నిఘా ఉంచి ఈనెల 14న వీరిని అరెస్టు చేశారని పేర్కొన్నారు. గంజాయి విక్రయిదారులను పట్టుకున్న రిమ్స్ సిఐ బి.రామకృష్ణారెడ్డి, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

ఆర్ఎంపి క్లినిక్‌లపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తూ పుట్టగొడుగుల్లా వెలసిన ఆర్ఎంపి క్లినిక్ సెంటర్లపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డివై ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అధికారి రఫీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ జిల్లాలో పుట్టగొడుగుల్లా ఆర్ ఎంపి క్లినిక్‌లు వెలిశా యని పేర్కొన్నారు. అర్హత ఉన్నా, లేకున్న క్లినిక్ సెంటర్ల తెరు స్తున్నారని, తద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బద్వేలు పట్టణం, అట్లూరు మండలాల్లో ఆర్ఎంపి కేంద్రాలు పెరిగి పోతున్నారన్నారు. నిబంధనల ప్రకారం సెలైన్ బాటిల్ వంటివి ఎక్కించరాదని, సూదులు వేయరాదని, ఆక్సిజన్ వంటి వాటికి అనుమతి లేకపోయినా అవేమీ పట్టవని ఆర్ఎంపిలు ప్రవర్తిస్తున్నారని వాపోయారు. ఆర్ ఎంపి వైద్యం కారణంగా మైదుకూరు, వేంపల్లి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు వంటి ప్రాంతాలలో మృతి చెందటం, అనారోగ్యాల పాలు అవ్వడం వంటివి సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. కానీ అధికారులు చుట్టపుచూపుగా వచ్చి మర్యాదలు స్వీకరించి వెళుతున్నారు తప్ప చర్యలు ఎక్కడా లేవని ఆరోపి ంచారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బద్వేలు, అట్లూరు మండలాల్లో ఆర్ఎంపి క్లినిక్ సెంటర్ల పై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆదిల్, కడప నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

పద్మావతి ఏజెన్సీ అరాచకాలను అరికట్టాలి

- గాంధీ విగ్రహానికి సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప జిజిహెచ్‌లో తొలగించిన సూపర్‌వైజర్లను తిరిగి విధులకు తీసుకోవాలని సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వైవి స్ట్రీట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ కడప జిజిహెచ్ లో18 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లను అకారణంగా తొలగించారని చెప్పారు. జిజిహెచ్ ప్రారంభం నుంచి శానిటేషన్ విభాగంలో కొనసాగుతున్న వారిని, కొత్తగా వచ్చిన పద్మావతి హౌస్కీపింగ్ సర్వీస్ వారు తొలగించడం అన్యాయమన్నారు. ఎవరినైనా తొలగించాలంటే ముందుగా నోటీసులు ఇవ్వాలని, తర్వాత వాటిపైన వారు సంతృప్తి చెందకుండా ఉంటే వారిని తొలగించాల్సి ఉందని పేర్కొన్నారు. పద్మావతి హౌస్ కీపింగ్ సర్వీస్ వారు ఎంఒయులో డిగ్రీ అర్హత ఉండాలని, కానీ వీరికి లేదు అని చెబుతున్నారని పేర్కొన్నారు. కావాలనే ఉద్దేశపూర్వకంగానే తొలగించారని చెప్పారు. అధికారులను మాత్రం తప్పుదోవ పట్టిస్తున్నారని పేర్కొన్నారు. తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు కార్యాలయ కార్యదర్శి ఉదయ్, రిమ్స్ సూపర్‌వైజర్ సుభాషిణి, ఆదామ్, వెంకటేష్, వెంకటేశ్వర రెడ్డి, అయ్యవారయ్య పాల్గొన్నారు.

విలువలకు ప్రతీకలు చిత్రాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

సౌందర్యాత్మక విలువలకు, సృజనాత్మకతకు ప్రతీకలు ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల చిత్రాలు నిలుస్తున్నాయని యోగివేమన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పుత్రా పద్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళా విభాగంలో వారం రోజుల 'ఇంక్ ఎ' పేరుతో ప్రింట్ మేకింగ్ వర్క్ షాప్ ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య పద్మ మాట్లాడుతూ వారం రోజులపాటు వుడ్‌కట్ , పెచ్చింగ్ ద్వారా తయారుచేసిన చిత్రాలు ఆహుతులను కట్టిపడేస్తున్నాయన్నారు. సౌందర్యాత్మక విలువ, సృజనాత్మకతకు, వినూత్న ఆలోచనలకు అద్దం పడుతున్నాయని విద్యార్థులను కొనియాడారు. లియోనార్డో డావిన్సీ వంటి గొప్ప చిత్రకారులుగా ఎదగాలంటూ ఆకాంక్షించారు. కళాకారుల ఎదుగుదలకు బారికెడ్లు ఉండవన్నారు. అంతర్ముక్కులుగా ఉండవద్దని, ఇక సాంకేతికతను వినియోగించుకోవాలని నూతన ప్రపంచం లోకి అడుగుడేలా ఆలోచనలు సాగాలని పేర్కొన్నార. ఇతర కళాశాల విద్యార్థులతో కలిసి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా విశ్వవిద్యాలయ ఖ్యాతి పెరగడంతో పాటు ఆర్థికపరమైన ప్రయోజనం లభిస్తుందన్నారు. లలితకళలశాఖ విభాగాధిపతి డాక్టర్ మృత్యుంజయరావు చేస్తున్న కృషిని కొనియాడారు. వర్క్‌షాప్ కన్వీనర్, లళిత కళల శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ వారం రోజులపాటు తీరిక లేకుండా విద్యార్థులు కష్టపడ్డారని అందుకు నిదర్శనమే ఈ చిత్రాలన్నారు. విశ్వవిద్యాలయ అధికారుల నిరంతర ప్రోత్సాహమే ఇందుకు కారణమన్నారు. వర్క్ షాప్‌లో పనిచేసిన ప్రతి ఒక్కరినే అభినందించారు. రిసోర్స్ పర్సన్ తెలంగాణ, తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎం.కృష్ణారెడ్డి, ప్రముఖ ప్రింట్‌మేకింగ్ నిపుణులు చలపాక అప్పలాచారి, అధ్యాపకులు సిహెచ్ వెంకటేష్, బి ఈరప్ప, ఎం.వాసవి, వైయస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి బరుణ్, అధ్యాపకులు మనోహర్ రావు ప్రసంగించారు. అనంతరం వర్క్ షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లును అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ శాఖ అధ్యాపకులు సి. హెచ్. వెంకటేష్, బి.చిన్న రాయుడు, బి.ఈరప్ప, ఎం. వాసవి, ఎస్.చంటి, డాక్టర్. కె.రెడ్డి శేఖర్ రెడ్డి, వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయ ఫైన్‌ఆర్ట్స్ అధ్యాపకులు పరుశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

నూరుల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

వృద్ధులకు, వికలాంగులకు నూరుల్లా ట్రస్ట్ మదరసాల అధినేత సుభాన్ ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. వారికి కూరగాయలు, గోధుమపిండి కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న వృద్ధులకు ప్రతి నెలా మూడో శనివారం పింఛను, కూరగాయలు పంపిణీ చేస్తున్నానని అన్నారు. తనకు కల్గిన దాంట్లో పేదలకు సాయం చేయడంతో సంతోషంగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు అలవర్చుకుని పేదలకు చేతనైన సాయం చేయాలని పేర్కొన్నారు.



పేదలకు పింఛన్లు అందజేస్తున్న ట్రస్ట్ అధినేత సుభాన్

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ సుబ్బరాయుడు

ప్రజాశక్తి-కడప అర్బన్



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న డాక్టర్ సుబ్బరాయుడు

గ్రంథాలయాలలో విలువైన పుస్తకాలు ఎన్నో నిక్షిప్తమై ఉన్నాయని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ జి.సుబ్బరాయుడు అన్నా రు. శనివారం 58వ జాతీ య గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట ఎక్కడా దొరకని రాజ్యాంగ పీఠిక గ్రంథాలయాలలో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలు గ్రంథాలయాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయ కార్యదర్శి ఎలిశెట్టి పవన్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహిస్తూ ఉన్నామని చెప్పారు. వ్యాసరచన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు పుష్పరాజు, ప్రతాపుడు, మంజుల వాణి వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సీనియర్ అసిస్టెంట్ పి.రాజకుమార్, గ్రంథాలయ అధికారి జి. రాజకుమార్, సురేష్, నవాబు జాన్, జేమ్స్, సుబ్బమ్మ రామ, ప్రతాప్, శేఖర్, వెంకటరమణ, గౌస్, ఇబ్రహీం, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శిల్పారామాన్ని సందర్శించిన సిఇఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప శిల్పారామాన్ని రాష్ట్ర శిల్పారామాల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.స్వామి నాయుడు సందర్శించారు. శిల్పారామంలో ఉన్న గేట్ ఎంట్రీ, అంఫిథియేటర్, గేమ్స్ ఏరియాలను, బోటింగ్, క్లీనింగ్ పరిశీలించారు. అనంతరం బోటింగ్ బ్రిడ్జిని పరిశీలించి కడప అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటసుబ్బయ్యకు సూచనలు చేశారు. బోటింగ్ పాండ్ మధ్యలో గ్రీనరీ ఏర్పాటు చేసి చిన్న, చిన్న ఫంక్షన్ కోసం అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇంజినీర్‌కు సూచనలు ఇచ్చారు. శిల్పారామంలో పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ అన్ని శిల్పారామాల కన్నా కడపకు ఎక్కువ మంది ప్రజలు వస్తున్నారని పేర్కొన్నారు. కడప శిల్పారామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. హ్యాండీ క్రాఫ్ట్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలన అధికారి ఎస్. కృష్ణ ప్రసాద్, వెంకట సుబ్బయ్య, విజయవాడ అసిస్టెంట్ ఇంజినీర్ యస్వంత్ సిబ్బంది పాల్గొన్నారు.



కడప శిల్పారామాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర సిఇఒ స్వామి నాయుడు

మహిళల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కలసపాడు : మహిళల పట్ల భద్రత కలిగి ఉండాలని ఎస్ఐ ఎల్.తిమోతి తెలిపారు. శనివారం మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో ఎస్‌పి ఆదేశాల మేరకు మహిళలకు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఏ చిన్న సమస్య వచ్చినా శక్తి యాప్, 112కు డయల్ చేస్తే వారి సమస్యను పోలీసులు వచ్చి పరిష్కరిస్తారని చెప్పారు. 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. శక్తి యాప్ ద్వారా తామే అతి తక్కువ సమయంలో మహిళల సమస్యను వారి ఇంటి దగ్గరికి వెళ్లి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అమ్మాయిలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. మోసపూరిత మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కొత్త వ్యక్తులు గ్రామంలో కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇకమీదట ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో వారానికి రెండు రోజులు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఎటువంటి సంఘటనలు చోటు చేసుకున్నా పోలీసులకు తెలియజేయాలన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై 'డ్రోన్'తో నిఘా

ప్రజాశక్తి - కడప అర్బన్ : గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీస్ అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. శనివారం నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతం, గుర్రాల గడ్డ, పాత బస్సు స్టాండ్ వెనక ప్రాంతం, పరిసరాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానాస్పదంగా సంచరించే వారిని గుర్తించే చర్యలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా విచారిస్తున్నారు. స్పెషల్ పార్టీ సిబ్బంది, డ్రోన్ ఆపరేటర్ పాల్గొన్నారు.

దుబాయ్ జీనియస్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్



సర్టిఫికెట్లతో విద్యార్థులు

నగరంలోని నకాష్ వీధిలో ఉన్న దుబాయ్ జీనియస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ఇటీవల స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర సైకిల్ ర్యాలీలో పాల్గొని ప్రతిభ చాటారు. ఎంఇఒల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, అభినందనలు అందుకున్నారు. జెసి సాట్ ఎగ్జామ్ -2025 లో పాల్గొన్న విద్యార్థులు, విద్యార్థినులకు జెసిఐ జిల్లా ప్రెసిడెంట్ ఎస్ఎక్యు అమీర్ బాషా చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ ముఫ్తి సయ్యద్ మొహమ్మద్ అలీ బగ్దాది మాట్లాడుతూ జెసి సాట్ ఎగ్జామ్‌లో తమ స్కూల్ విద్యార్థులు దాదాపు 80 మందికి సర్టిఫికెట్లు రావడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్రలో జరిగిన సైకిల్ ర్యాలీలో 40 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు రావడం అభినందించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు ఇటువంటి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం ప్రశంసనీయమన్నారు.

కుల జనగణన తరువాతే 'స్థానిక'ఎన్నికలు నిర్వహించాలి

ప్రజాశక్తి - కడప : కుల జనగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కళ్యా సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం రాష్ట్రంలో కుల జన గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు అన్నారు. బిసి కుల జనగణన ఎ,బి,సి,డి వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతుందని అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన నిర్ణయంగా ప్రకటించాలని కోరుతూ ఈ పిల్ పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ నేతృత్వంలో ధర్మాసనం బుధవారం విచారణ నిర్వహించనున్నారని చెప్పారు. సమావేశంలో నగరకమిటీ ప్రధాన కార్యదర్శి హరి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సూరీడు, జిల్లా ప్రచార కార్యదర్శి రానా ప్రతాప్ పాల్గొన్నారు.

అరాచకం!

ప్రజా'దృష్టి'

మదనపల్లి కేంద్రంగా సాగిన కిడ్నీ రాకెట్ వ్యవహారం సంచలనం రేపింది. సినిమాలో చూపించే తరహాలో విస్తుపోయేలా చేసింది. దేశంలోని మెట్రోపాలిటన్ సిటీల్లో కిడ్నీ రాకెట్లు నడుస్తాయనుకునే వాళ్లం. తృతీయశ్రేణి పట్టణంలో ఇంతటి అమానుష తతంగం నడుస్తుంటే జిల్లా అధికార యంత్రాంగం ఏమి చేస్తోందనే చర్చ నడుస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహించే కీలక అధికారే కిడ్నీ రాకెట్‌కు సూత్రధారి కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. చివరికి డబ్బుల ఎరకు కిడ్నీ ఇస్తానని వచ్చిన పేద మహిళ మృత్యువుకు గల కారణామిటో వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది. పేదరికం కారణంగా చివరికి కిడ్నీలను సైతం అమ్ముకోవాల్సిన దుస్థితికి దాపురించడానికి కారణాలేమిటో ఆరా తీయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్యులు సొంత క్లినిక్కులు నడపడం నేరం. వ్యవస్థాగత నేరానికి ఎవరు కారకులో విధాన కర్తలు ఆలోచించాలి. మొన్న నంద్యాల జిల్లాలో ఓ మహిళ డెలవరీ సమయంలో తెగిన పాలోపియన్ నాళం కారణంగా బతికి ఉండి జీవచ్ఛవంగా మారడం, తాజాగా మదనపల్లిలో కిడ్నీ రాకెట్ వ్యవహారానికి ప్రభుత్వాస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ విభాగాల్లో పనిచేసే అధికారులే కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు జిల్లా ప్రభుత్వాస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాల్లో విధులు నిర్వహించడానికి అవకాశం ఇవ్వకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లా స్థాయి ఉన్నతాధికార స్థానాల్లో కీలకమైన వైద్యులు ఉండడం ద్వారా గుట్టుచప్పుడు గాకుండా ఇటువంటి తప్పుడు వ్యవహారాలు సాగిపోతున్నాయనే వాదనకు బలం చేకూరుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిన్నమండెం పర్యటన మొక్కుబడిగా సాగిపోయింది. నదుల అనుసంధానమే తన జీవితాశమని చెబుతున్న ముఖ్యమంత్రి అన్నమయ్య జిల్లాలోని శ్రీనివాసపురం రిజర్వాయర్‌ను పూర్తి చేయక పోవడం వెనుక గల చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. హెచ్ఎన్ఎస్ఎస్, జిఎన్ఎస్ఎస్ కాల్వలకు లింకు కాల్వను ఏర్పాటు చేయడం ద్వారా శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయొచ్చు. అన్నమయ్య రిజర్వాయర్ నిర్మాణానికి కాంట్రాక్టు ఏజెన్సీని రద్దు చేయడమో, కొనసాగించడమో చేయకుండా కాలయాపన చేయడం ఎందుకో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. జిల్లాలో డిజిటల్ దొంగల ముఠాను అరెస్టు చేయడం ద్వారా ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడం శుభదాయకం. ఈడి, సిబిఐ, ఎన్ఐఎ, ఇన్‌కం ట్యాక్స్ అధికారుల పేర్లతో స్థానికులను ఫోన్ల ద్వారా బెదిరించడం, లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకోవడం పరిపాటిగా మారింది. అనుచిత బెదిరింపుల ద్వారా లక్షలాది రూపాయలు పొగొట్టుకుని లబోదిబోమని వాపోతున్న వారందరికీ స్వల్ప ఉపశమనం లభించిందనే చెప్పాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి రాజేంద్రప్రసాద్

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

అసాంఘిక కార్యకలాపాలు, మహిళలపై దాడులు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు జరగకుండా ప్రత్యేకదృష్టి పెట్టాలని మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని శనివారం డిఎస్‌పి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి పంచాయతీపై ప్రత్యేక నిఘా, పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. బాధితుల పట్ల సిబ్బంది స్నేహపూర్వకంగా, మర్యాదగా వ్యవహరించాలన్నారు. బాధితులకు సత్వరమే న్యాయ సేవలు అందించాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది గౌరవ వందనం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరు ఎస్ఐగా ధనుంజయులు

ప్రజాశక్తి - దువ్వూరు



దువ్వూరు ఎస్‌ఐగా ధనుంజయులు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలన్నారు. ఎలాంటి గొడవలకు తావివ్వ రాదన్నారు. గ్రామాల్లో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే దువ్వూరు పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.



ఆటోడ్రైవర్లకు సూచనలిస్తున్న అర్బన్ సిఐ కె.రమణారెడ్డి

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ప్రజాశక్తి-మైదుకూరు రూరల్ : మోటారు వాహన చట్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అర్బన్ సిఐ కె.రమణారెడ్డి సూచించారు. స్థానిక రోడ్లలో ఉన్న అంకాళమ్మ గుడి ఆవరణలో శనివారం ఆయన ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎస్‌పి షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఆటో నడిపే సమయంలో యూనిఫాం తప్పనిసరిగా ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆటో ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. డ్రైవర్ సీటు పక్కన అదనపు సీట్లు పెట్టి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

క్రైం కార్నర్



మాట్లాడుతున్న డిఎస్‌పి మురళి నాయక్

డబ్బుతో ఉడాయించిన హార్టికల్చర్ అసిస్టెంట్ అరెస్టు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రైతుల, అప్పగించిన పింఛన్ డబ్బుతో ఉడాయించిన హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆన్‌లైన్ బెట్టింగులకు బానిసై అప్పులు చేస్తూండేవాడన్నారు. బెట్టింగ్‌కు ఎవరూ అప్పు ఇవ్వకపోవడంతో పింఛన్ పంపిణీ చేయకుండా రూ.6.25లక్షలు, రైతు వద్ద నుండి సబ్సిడీ కోసం విత్తనాలకు రూ.10.74 లక్షలు, ఎరువులకు రైతుల వద్ద నుంచి రూ.7.27 లక్షలతో ఉడాయించాడని తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు రూరల్ సిఐ రమణ, సింహాద్రిపురం ఎస్‌ఐ రవికుమార్‌లు పట్టణంలోని చందమామ దాబా వద్ద ప్రవీణ్ కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని, రూ.1.15లక్ష నగదు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి వివరించారు. నిందితున్ని కోర్టు ముందు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ రమణ, ఎస్‌ఐ రవికుమార్‌ను డిఎస్‌పి అభినందించారు.

నెమలిని చంపిన కేసులో వ్యక్తి...

వేంపల్లె : వేంపల్లె అటవీ రేంజ్ పరిధిలోని చిలేకంపల్లి బీట్‌లో నెమలిని చంపిన కేసులో మెదరి గంగన్న అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ బాల సుబ్రమణ్యం తెలిపారు. చక్రాయపేట మండలంలోని కొలవాండ్లపల్లె గ్రామ పరిధిలోని చిలేకంపల్లి బీట్‌లో వేంపల్లెలోని శ్రీరాంనగర్‌కు చెందిన మెదరి గంగన్న అనే వ్యక్తి శుక్రవారం నెమలిని వెంటాడి చంపినట్లు ఫారెస్టు రెంజర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా నెమలిని చంపిన ఘటనను గుర్తించామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న డిప్యూటీ రెంజర్ సుబ్బయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సుమలత, సైక్లింగ్ ఫోర్స్, ప్రొటెక్షన్ సిబ్బందిని బాలసుబ్రమణ్యం అభినందించారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జువారి సిమెంట్ పరిశ్రమ మైన్స్ బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి ప్రకంపనం చెంది సమీప వలసపల్లెలో సోమవారం మట్టి మిద్దె కూలి నల్లపల్లె వీరమ్మ చనిపోయిందన్నారు. వీరమ్మ కుటుంబానికి, అలాగే గ్రామంలో ఇంటి గోడలు చీలి, ఇళ్లు కూలిపోయి నష్టపోయిన బాధితులకు పరిహారం సదరు యాజమాన్యం చెల్లించాలని కోరారు. జువారి సిమెంట్ పరిశ్రమకు కూతవేటు దూరంలో వలసపల్లె ఉందన్నారు. 40ఏళ్లుగా సున్నపురాయి కోసం పరిశ్రమ వారు తవ్వకాలు జరుపుతూ గ్రామానికి అతి సమీపానికి చేరువయ్యారని తెలిపారు. రాయి ఒక్కో లేయర్ బ్లాస్టింగ్ చేయాల్సి ఉండగా, మైనింగ్ శాఖ నియమాలను ఉల్లంఘిస్తూ ఒకేసారి మోతాదుకు మించి పేలుడు పదార్థాలను వినియోగించి, నాలుగు లేయర్లను ఒకేసారి పేల్చుతున్నారని తెలిపారు. తద్వారా భూమి కంపించుతోందని వివరించారు. పరిశ్రమ ద్వారా వచ్చే కాలుష్యం వల్ల ఎక్కువ సంఖ్యలో స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన దళిత మహిళ వీరమ్మ మృతికి బాధ్యత వహిస్తూ ఆమె కుటుంబానికి యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జువారి, ఎర్రగుంట్ల ఐసిఎల్, చిలమకూరు ఐసిఎల్, భారతి సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిశ్రమలు విడుదల చేసే విషతుల్యమైన రసాయనాల వలన నీరు, గాలి కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై కలెక్టర్ స్పందించి పరిశ్రమల ద్వారా మెడికల్ క్యాంపులు పెట్టించాలన్నారు. సమీప గ్రామాల ప్రజల ఆరోగ్యం పట్ల స్థానిక పరిశ్రమలు బాధ్యత వహించాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో వలసపల్లె గ్రామప్రజలు చంద్రశేఖర్, రామాంజనేయులు, శ్రీనివాసులు, రామయ్య, సుబ్బరాయుడు, నాగరాజు, కృష్ణయ్య, మునెయ్య, గాయత్రి, మల్లేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం పెంపు



పుస్తక పఠనంలో అధికారి వనజాకుమారి, విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

గ్రంథాలయాలు సమాజ అభివృద్ధికి పునాదులు వంటివని కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయాల శాఖ అధికారి డాక్టర్ పొట్లన్నగారి మాధవరావు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సతీష్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ బాలకొండ గంగాధర్, షఫీ ఉద్దీన్, రాజారెడ్డి, వినోద్ కుమార్, రేష్మా, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షలకు సంసిద్ధం కావాలని లైబ్రియన్ వనజా కుమారి కోరారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు (మైదుకూరు) : విద్యార్థులు క్రమం తప్పకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయ అధికారి మనోహర్ తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా 2వ రోజు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. హైస్కూల్ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తక ప్రదర్శన తిలకించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాముడు, పాఠకులు పాల్గొన్నారు.

తొండూరు : పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయాధికారి స్వరూపరాణి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శనివారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రంథాలయంలోని అన్ని రకాల పుస్తకాలను విద్యార్థులకు పరిచయం చేశారు.

ముద్దనూరు : గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ అధికారి రాజశేఖర్ తెలిపారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడం వల్ల విజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్‌లో పారిశుధ్యం అధ్వానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలోని మూడవ లైన్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, ప్రజల అసౌకర్యాన్ని పరిష్కరించాలని సిపిఎం నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి ఏసుదాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ శనివారం లక్ష్మీనగర్ మూడవ లైన్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు కాలువ సరిగాలేక డ్రెయినేజీ నీరంతా రోడ్డు మీద పారుతోందన్నారు. దుర్వాసన వెదజల్లుతోందన్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. డివైఎఫ్ఐ నాయకులు సుదర్శన్, లక్ష్మీనగర్ కాలనీ వాసులు చంద్రశేఖర్, సత్యనారాయణ, సురేంద్ర పాల్గొన్నారు.

గడ్డ మసీదు ఆస్తులు అన్యాక్రాంతం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని పురాతన గడ్డ మసీదు భూములను పలువురు అక్రమంగా తమ పేరుపై ఆన్‌లైన్ చేసుకుంటున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గడ్డ మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు, గడ్డ మసీదు యూత్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఆర్‌డిఒ సాయిశ్రీని కోరారు. ఆ మేరకు శనివారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మసీదుకు నవాబుల కాలం నుంచి ఎంతో మంది నవాబులు జమ్మలమడుగు తాలూకాలోని మైలవరం, జమ్మలమడుగు మండలాల్లో పొలాలు, భూములు దానం చేశారన్నారు. ప్రస్తుతం ఈ గడ్డ మసీదుకు సంబంధించిన ఆస్తులు, భూములు వక్ఫ్‌బోర్డ్ ఆధీనంలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో గడ్డ మసీదు యూత్ కమిటీ సభ్యులు జమీర్ బాషా, రెహమాన్, మహబూబ్ బాషా, ఇంతియాజ్, షేక్ హమీద్, మహమ్మద్ నూర్, తాజుద్దీన్, అబ్దుల్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు దఫేదర్ ఫయాజ్ బాషా, కడప నజీర్ అహ్మద్, షేక్ సత్తార్, గయాజ్ బాషా, గడ్డ మసీదు సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

ప్రజాశక్తి - సింహాద్రిపురం: విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. సింహాద్రిపురంలో మండల విద్యాశాఖ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎంఆర్‌సి భవనాన్ని కూల్చివేసి, నిర్మించకపోవడం శోచనీయమన్నారు. పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని నూతన సదుపాయాలతో ఏర్పాటు చేసి ప్రారంభించడం తనకు ఎంతో సంతోషం, గర్వంగా ఉందన్నారు. మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన విద్య వనరుల కేంద్రాన్ని ఉపాధ్యాయులు, సిబ్బంది సద్వినియోగం చేసుకొని విద్యాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. హెచ్‌ఎల్‌సి హై లెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, ఎంఇఒలు ఖాదర్‌బాషా, శారద, టిడిపి నాయకులు పుష్పాల శ్రీధం రెడ్డి, సింగల్ విండో చైర్మన్ గోపాల్‌రెడ్డి, నియోజవర్గ టిడిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి వర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రైతులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరులో రైతులు, పింఛన్‌దారుల నగదుతో పరారైన బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని పులివెందుల నియోజవర్గ టిడిపి ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం ఆయన అంకాలమ్మ గూడూరులో బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతులకు తన సొంత నిధులు రూ.15 లక్షలు చెల్లించి వారికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చిన్నయ్య, తహశీల్దార్ వెంకట సాయినాథ్ రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల ద్వారా ఉపాధి సాధ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : పరిశ్రమల స్థాపన ద్వారా స్థానికంగా ఉపాధి లభించడంతోపాటు అభివృద్ధికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. శనివారం మైదుకూరు మున్సిపాలిటీ గడ్డంవారిపల్లె ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో లియోకాన్ ఇన్‌ఫ్రా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాలా సహకారం అందజేస్తుందన్నారు. యువత నూతన ఆలోచనలతో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతన కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, నీటి పారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, టిడిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి, కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

జలహారతిలో ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్ బ్రహ్మసాగర్‌లో జలహారతి కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం బ్రహ్మసాగర్‌లో 17.2 టీఎంసీ నీళ్లు ఉన్నాయి. బ్రహ్మసాగర్ కుడి కాల్వకు 50 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 250 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి మండల టిడిపి నేతలు, తెలుగంగ అధికారులు పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి : సిఇఒ

దువ్వూరు : సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని జడ్‌పి సిఇఒ ఓబులమ్మ సూచించారు. మండలంలో జరుగుతున్న పనుల తీరుపై శనివారం ఆమె ఓబులమ్మ ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించారు. జరుగుతున్న పనుల తీరు, శానిటేషన్ కార్యక్రమాలు, తాగునీటి సరఫరా పనులు సక్రమంగా జరగాలని ఎంపిడిఒ సుబ్బారెడ్డిని ఆదేశించారు. సిబ్బంది విధులకు సక్రమంగా రావాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసు కుంటామని ఆమె హెచ్చరించారు. కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు.

అనాథశ్రమంలో జడ్జి తనిఖీ

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల : ఎవరైనా ఇళ్లకు వెళ్లాలనుకుంటే పంపే ఏర్పాటు చేస్తామని మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మధు సూదన్‌రావు వృద్ధులకు సూచించారు. మండలంలోని తిప్పలూరులోని ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్నవారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. పండ్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న కొంతమంది వృద్ధాప్య పింఛన్ రాలేదని తమకు తెలిపారని, పెన్షన్ ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. మానసిక వ్యాధి, మతిస్థిమితం లేకపోవడం వంటి వారు ఉంటే సంబంధిత చికిత్స కేంద్రాలకు పంపిస్తామన్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు యుపిఎస్‌సి నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు అర్హులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడలో శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 17 నుంచి 25 లోపు బిసి స్టడీ సర్కిల్, కడప బిసి భవన్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. డిసెంబర్ 5న స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇందులో ఉత్తీర్ణులైన వారికి మెరిట్ ఆధారంగా విజయవాడలో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి బిసి భవన్, గొల్లపూడి, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్క్స్ లిస్ట్, క్యాస్ట్ సర్టిఫికెట్, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతపరిచి నేరుగా పాత రిమ్స్‌లో ఉన్న కడప బిసి భవన్‌లో అందజేయాలని పేర్కొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న వైద్యాధికారులు

అబార్షన్ల నిర్వహణ పారదర్శంగా ఉండాలి

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

అబార్షన్ల నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ వి.మల్లేష్ సూచించారు. బద్వేల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అక్టోబర్‌లో జరిగిన గర్భస్రావాల (అబార్షన్ల) నిర్వహణపై ఆడిట్ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం ఆడిట్ నిర్వహించారు. డాక్టర్ వి.మల్లేష్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్రావాల విషయంలో వైద్య సిబ్బంది సరైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా అబార్షన్ల రికార్డుల నిర్వహణ అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఆదేశించారు. గర్భస్రావాల ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి అబార్షన్ చట్టబద్ధమైన నిబంధనల ప్రకారమే జరగాలన్నారు. ఆడిట్ కార్యక్రమంలో డాక్టర్ మల్లేష్‌తోపాటు గైనకాలజిస్ట్ డాక్టర్ వి.సుధా, సూపర్వైజర్లు కె.వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమలుకాని 'సూపర్‌సిక్స్' మాటేంటీ..?

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చెప్పిన సూపర్‌సిక్స్ పథకాల్లో అమలుకాని వాటి మాటేంటని, అమలు చేయాల్సిన పథకాల వాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు జవాబు చెప్పాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి 17 నెలలు పూర్తయినప్పటికీ, ఇప్పటికీ సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానమైనవి అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, బిసి, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకు సామాజిక పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడంలేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అవినీతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రిలో అవినీతి చోటుచేసుకునిందని, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న అవకతవకలపై డిసిహెచ్ఎస్ హిమాదేవిని, సూపరింటెండెంట్ డాక్టర్ సుజాతను ఆయన నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు తక్కువగా ఉండడం, ముఖ్యంగా సిటీ స్కాన్, ఎంఆర్ఐ సేవలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. రోజుకు 60నుంచి 80 వరకు చేయాల్సిన ఎంఆర్ఐ, సిటీ స్కాన్లు ప్రస్తుతం 10నుంచి15కే పరిమితిమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని రోగులు బయట చేయించుకుంటే వారి నుంచి రూ.3000 ప్రకారం వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్స్ విజయవాడ యాజమాన్యాలు పువ్వాడి భాస్కర్, దామోదర్ గుప్తా స్థానిక ప్రజల నుండి దోచుకున్న సొమ్మును తిరిగి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అవినీతి వ్యవహారానికి బాధ్యులు ఎవరో ప్రభుత్వం వెంటనే వెల్లడించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రజల్ని మోసం చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచాలన్నారు. జిల్లా అధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని, ప్రతి వారం ఆసుపత్రిని సందర్శించి పరిస్థితిని సమీక్షిస్తామని ఇర్ఫాన్ బాషా స్పష్టం చేశారు.



వైద్యాధికారులను నిలదీస్తున్న ఇర్ఫాన్‌బాషా

గండి క్షేత్రంలో అన్నదానం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో కార్తీకమాసం చివరి శనివారం సందర్భంగా ఉత్తరప్రదేశ్ వాసి రామ్‌దిన్ శనివారం భారీగా అన్నదానం చేశారు. 6000 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గండి ఇఒ వెంకటసుబ్బయ్య, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, రామ్‌దిన్ బంధువులు, రాజ నరసింహారెడ్డి, త్రివేణి, పద్మావతి, పూర్విక, గ్రీష్మంత్ రాజ, రామ్‌దిన్ మిత్రులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలకు చెల్లించని జీతాలు

- అయోమయంలో పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - వేంపల్లె

వీధులన్నీ పరిశుభ్రంగా తీర్చిదిద్ది ప్రజా రోగ్యాన్ని కాపాడే క్లాప్ మిత్రలకు (హరిత రాయబారులు) రెండు నెలలుగా జీతాలను పంచాయతీ అధికారులు చెల్లించలేదు. జీతాలు రాక క్లాప్ మిత్రలకు చెందిన పారిశుధ్య కార్మికులు అయోమయంలో ఉన్నారు. వేంపల్లెలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం లో 28 మంది క్లాప్ మిత్రకు చెందిన పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. పంచాయతీలో నిధులున్నా అధికారులు మాత్రం జీతాలు ఇవ్వడం లేదు. వేంపల్లె పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న అధికారికి చెక్ పవర్‌లేని కారణంగా జీతాలు ఇవ్వడంలో ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. జీతాలు ఇచ్చేందుకు పంచాయతీ అధికారులు సరైన మొగ్గు చూపడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. పులివెందుల డిఎల్‌పిఒకు చెక్ పవర్ ఉన్నప్పటికీ పంచాయతీ నిధుల నుండి జీతాలు ఇవ్వక పోవడంతో క్లాప్ మిత్రలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా క్లాప్ మిత్ర కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డిని వివరణ కోరగా.. క్లాప్ మిత్రలకు జీతాలు ఇవ్వాల్సిన విషయం నిజమేనని, తనకు జీతాలు ఇచ్చేందుకు చెక్ పవర్ లేదన్నారు. క్లాప్ మిత్రలకు జీతాలను డిఎల్‌పిఒ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే వీరి జీతాలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.